క్లుప్తంగా

104 సేవలను సద్వినియోగం చేసుకోండి

బి.కోడూరు : నేటి నుంచి మండలానికి వస్తున్న 104 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఉదయ్‌కిరణ్ తెలిపారు. అక్టోబర్ నెల అంతా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగినందున ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌ల గ్రామాలకు వెళ్ళలేకపోయారని, నవంబర్ 1వ తేదీ నుంచి జరిగే 104 వాహనంతో పాటు ఫ్యామిలీ డాక్టర్ హాజరవుతారని ఆయన తెలిపారు. అందులో భాగంగా బుధవారం మున్నెల్లిలో 104 సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

చాపాడు : మండలంలోని అయ్యవారిపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం క్రీడా దుస్తులు పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు ఎస్.గుర్రప్ప తెలిపారు. పాఠశాలలో హిందీ ఉపాధ్యాయినిగా పని చేస్తున్న సుశీల తన తండ్రి బాలన్న జ్ఞాపకార్థం రూ.10వేలు విలువ చేసే క్రీడా దుస్తులను ఫిజికల్ డైరెక్టర్ శివారెడ్డి అందజేశారు. ప్రధానోపాధ్యాయుడి చేతుల మీదుగా విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష వైద్య శిబిరాలు విజయవంతం

ప్రొద్దుటూరు క్రైం : అందరి సహకారంతో జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాలు విజయవంతం అయినట్లు ఎంపీడీఓ కుల్లాయమ్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి హనీఫ్‌బాబా మాట్లాడుతూ సుమారు 6657 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. సమావేశంలో వైద్యులు శ్రీనివాస్, ఇళయరాణి, మహాలక్ష్మి, షేక్ జరీనా, హుస్సేన్‌బాషా, శ్రీకాంత్, తేజ, హెచ్ఈ శోభారాణి, సీహెచ్ఓ కృష్ణమ్మ, హెచ్ఎస్ చంద్రకళ, సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

■ జగనన్న ఆరోగ్య సురక్షతో గ్రామాల్లో ప్రభుత్వం ఖరీదైన వైద్యాన్ని అందిస్తుందని కల్లూరు పీహెచ్‌సీ డాక్టర్ మహాలక్ష్మి తెలిపారు. మండలంలోని బొజ్జవారిపల్లెలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్ సురేష్ రెడ్డి వైద్య శిబిరాన్ని పరిశీలించారు. సర్పంచ్ వీరారెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



మాధవి

బి.కోడూరు : మండలంలోని ఆదిత్యారాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బి.మాధవి రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెంచలయ్య తెలిపారు. సోమవారం ప్రొద్దుటూరులో జరిగిన జిల్లాస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. నవంబర్ 4 న ఆత్మకూరులో జరిగే రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీల్లో మాధవి పాల్గొననున్నట్లు తెలిపారు.

అక్రమ కట్టడాల తొలగింపు



అక్రమ కట్టడాలను తొలగిస్తున్న దృశ్యం

అట్లూరు : బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను మంగళవారం మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు తొలగించారు. మడకలవారిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబరు 954లో సుమారు 17 సెంట్ల ప్రజా అవసరాల కోసం కేటాయించారు. అయితే ఈస్థలం నేతాజి స్కూల్ వెనుక భాగంలో ఉండటంతో సుమారు కోటి రూపాయల విలువ చేస్తుంది. దీంతో కొంత మంది అక్రమార్కులు రాత్రికి రాత్రే అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, గోపవరం తహసీల్దారు దామోదర్‌రెడ్డి వారి సిబ్బందితో పోలీసుల సహకారంతో అక్రమంగా నిర్మించిన కట్టడాలను జేసీబీతో తొలగించారు. అయితే ఎవరు ఆక్రమించారనే విషయంపై అధికారులు తెలపలేదన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి

ఎర్రగుంట్ల : అధికారులు పట్టణ అభివృద్ధికి సహకరించాలని మంగళవారం స్థానిక మున్సిపల్ భవనంలో నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ మాట్లాడుతూ వార్డులలో కౌన్సిలర్లు సూచించిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి



పోరుమామిళ్లలో జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



యూనిటీ రన్‌లో పాల్గొన్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

పోరుమామిళ్ల : విశాల భారతావనిని ఏకం చేసిన వ్యక్తి, ముక్కలుగా ఉన్న సంస్థానాలను దేశంలో కలిపిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ అంటూ ఆయనే మొదటి ఉపరాష్ట్రపతి, కేంద్ర హోంమంత్రి అన్నారు. ప్రిన్సిపాల్ రామిరెడ్డి. జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం అనే సిద్ధాంతాన్ని పాటిస్తూ దేశంలో ఉన్న సంస్థానాలను భారత్‌లో విలీనం చేసిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బి.కోడూరు : మండలంలోని రామచంద్రాపురం ప్రాథమిక పాఠశాలలో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు రమణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ఐక్యత ప్రతిజ్ఞ చేయించి మారథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఐక్యత భావాల గురించి, ఐకమత్యం గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం

మైదుకూరు : దేశ తొలి ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మొదట రన్ ఫర్ యూనిటీలో భాగంగా విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది కళాశాల నుండి ఇందిరమ్మ కాలనీ, రెవెన్యూ కార్యాలయం మీదుగా పరుగు నిర్వహించారు. ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ సమైక్యతలో ముఖ్య పాత్రను పోషించారని పేర్కొన్నారు. రాజ్యాంగ రచనలో పాల్గొన్నారని, దేశ ప్రధాని మంత్రి పదవిని సైతం త్యాగం చేశారని ఆయన సేవలను కొనియాడారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీవీ కృష్ణారెడ్డి, ఆంగ్ల అధ్యాపకుడు రాధారామ్ మాట్లాడారు.



బి.కోడూరులో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన కృషి ఎంతో అమూల్యమైనదని తెలిపారు. కార్యక్రమంలో రచయిత జింకా సుబ్రహ్మణ్యం, యడవల్లి రమణయ్య, శ్రీనివాసులరెడ్డి, శ్రీనివాసులు, హరి తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలన



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రగతితో పాటు అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 34వ వార్డులోని పప్పులవీధి, రాజుగారివీధిలలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి ప్రభుత్వం ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కోవిడ్ కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాల్లో ఎక్కడా కోత విధించకుండా ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి తాము వార్డుల్లో ధైర్యంగా తిరిగే హక్కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, వైవీయూ పాలక మండలి సభ్యులు కొండపల్లి చిన్నసుబ్బారావు, కౌన్సిలర్ చక్రపాణిఉమ, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు, వివిధశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మ విగ్రహ ప్రతిష్టలో పట్టింపులు

బ్రహ్మంగారిమఠం : బి.మఠంలోని బద్వేల్ రోడ్డులో వెలసిన పోలేరమ్మ గుడిలో ఈనెల 17నుంచి నూతన విగ్రహ ప్రతిష్టను బి.మఠం దేవస్థానం నిర్వాకులు నిర్వహించనున్నారు. ఇందుకు అమ్మవారి విగ్రహం విషయంతోపాటు పూజా కార్యక్రమాలు మేం అంటే మేమని కందిమల్లాయ్యపల్లె, సోమిరెడ్డిపల్లె ప్రజలు రెండు రోజులుగా పోటీ పడుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సోమిరెడ్డిపల్లెనుంచి మహిళలతో సహా వందల సంఖ్యలో బి.మఠంలోని ప్రస్తుతం ఉన్న పోలేరమ్మగుడి దగ్గర నిరసనకు దిగారు. రెండు గ్రామాలవారితో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, ఎండోమెంట్ ఏసీ మఠం పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీలు చర్చలు జరిపారు. ఎంపీపీ వీరనారయణరెడ్డి, ఏసీలు మట్లాడుతూ అమ్మవారి విగ్రహ ప్రతిష్టను సంప్రదాయం ఎలా ఉంటే అలానే జరుపుతామన్నారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కుడా చైర్మన్‌కు సన్మానం



కుడా చైర్మన్ గురుమోహన్‌ను సన్మానిస్తున్న దళిత ప్రజాసంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్ధవటంరోడ్డులో నిర్మించిన అంబేడ్కర్ భవన్ అభివృద్ధి పనులకు గాను కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి రూ.20 లక్షలు మంజూరు చేసిన కుడా చైర్మన్ సింగసాని గురుమోహన్‌ను మంగళవారం దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ భవన అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కూకట్లపల్లె మురళి, దళిత చైతన్యఫోరం రాష్ట్ర నాయకులు సొద్దలపెంచలయ్యలు మాట్లాడుతూ భవనం అభివృద్ధి చేయని కారణంగా అసాంఘీక కార్యకలాపాలు జరుగుతున్న నేపథ్యంలో విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సుధ దృష్టికి తీసుకెళ్ళగా రూ.15 లక్షలు నిధులు మంజూరు చేయించి కొంత మేర ప్రహరీగోడ నిర్మాణం చేపట్టడం జరిగిందని, మిగిలిన అభివృద్ధి పనులకు కుడా చైర్మన్ గురుమోహన్ రూ.20 లక్షలు కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ గురుమోహన్ మాట్లాడుతూ సామాజిక సాధికారత దిశగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనార్టీలకు ఉపయోగపడే అంబేడ్కర్ భవన్ అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.సి.రమణ, బీసీ సంఘాల నాయకులు గురుమూర్తి, అనిల్, సీపీఐ మాజీ నాయకులు చంద్రశేఖర్, రూరల్ కార్యదర్శి ఇమ్మానియేల్, సీనియర్ దళిత నాయకులు ఓ.ఎస్.వి.ప్రసాద్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు బ్రహ్మయ్య, పిచ్చయ్య, ప్రజాకవి ఇరుపోతుశ్రీనివాస్‌వర్మ, అంబేడ్కర్ భవన అభివృద్ధి కమిటీ కార్యదర్శి గోస్‌పీర్, ఉపాధ్యక్షుడు సామేలు, ఆవాజ్ నాయకులు సత్తార్, అన్వర్‌బాషా, సామాజిక చైతన్య సమితి నాయకులు గంగయ్య తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

ప్రొద్దుటూరు : పట్టణంలో పలు ప్రాంతాల్లో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామయ్య, హమాలీ సివిల్ సప్‌లై గోడౌన్ వద్ద ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు, శివాలయం సెంటర్ వద్ద ఏఐటీయూసీ ఆటో యూనియన్ సీనియర్ నాయకుడు ధనిరెడ్డి శివారెడ్డి, పాత బస్టాండ్ వద్ద ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి యేసోబ్, పవర్ హౌస్ రోడ్డులోని విద్యుత్ కార్యాలయం వద్ద లక్ష్మీనారాయణ ఏఐటీయూసీ పతాకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మంగళవారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆర్టీసీ బస్టాండువద్ద జండా ఎగురవేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్, సీపీఐ మండల కార్యదర్శి రవి గాంధీబొమ్మ సెంటర్‌లో, ఆటో స్టాండ్ వద్ద జండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధరంగాల్లో పని చేస్తున్న కార్మికులు నిత్యం కత్తిమీద సాము లాంటి జీవనం గడుపుతున్నారన్నారు. 1920 అక్టోబర్ 31న దేశ వాణిజ్య రాజధాని ముంబాయిలో మొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ పురుడు పోసుకున్నదన్నారు. అనేక పోరాటాలు చేసి 8 పని గంటల చట్టం సాధించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ మండల నాయకులు పాల్గొన్నారు.

మైదుకూరు : మైదుకూరులో సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు కూడళ్లలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు యూనియన్ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక సంక్షేమం కోసం ఏఐటీయూసీ ఎన్నో పోరాటాలను చేసిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు శ్రీరాములు, ఏవీ శివరాం, పి.భాస్కర్, పీరయ్య, బీవీ శ్రీనివాసులు, టీపీ మునయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించాలని జేడీకి వినతి



జేడీకి వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఖాజీపేట : ఎండిపోతున్న పంటలకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు పీవీ రాఘవరెడ్డిలు మంగళవారం జేడీకి వినతి పత్రం అందించి విజ్ఞప్తి చేశారు. ఖాజీపేట మండలంలో కరువు పరిస్థితిపై మండల వైఎస్సార్ సీపీ నాయకులు వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు నాగేశ్వర్‌రావును కలిసి వివరించారు. మండలంలో అత్యధికంగా మినుము, పత్తి, తోపాటు అన్ని ఆరుతడి పంటలు అధికంగా సాగుచేశారన్నారు. వరి సాగుచేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒక వైపు తీవ్ర వర్షభావం, కాలువలకు నీరు రాకపోవడం, బోరులో నీరు ఇంకిపోవడం వంటి సమస్యల కారణంగా సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఇన్సూరెన్స్ లేదా నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో తుడుమలదిన్నె సర్పంచ్ కృష్ణారెడ్డి, చెమ్ముళ్ళపల్లె సర్పంచ్ చంద్రశేఖర్, దుంపలగట్టు నాయకుడు రామకృష్ణారెడ్డి, చెన్నకేశవరెడ్డి తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చు పెడుతోంది



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గఫూర్

మైదుకూరు : మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో ప్రజా సమస్యలను గాలికి వదిలేసి మతాల మధ్య చిచ్చు పెడుతోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ ఆరోపించారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు జాతా మంగళవారం మైదుకూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా మైదుకూరులో బహిరంగ సభలో ఎంఏ గఫూర్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగం, దారిద్ర్యం పెరిగిపోయిందని, నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయాయన్నారు. ప్రతి ఒక్కరి వారి ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తామన్న మోదీ వాటిని విస్మరించారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యల గురించి ఆలోచించడం లేదన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం మతాల పేరుతో ప్రజల మధ్య తగాదాలు సృష్టిస్తున్నారని, ప్రజలు ఐక్యంగా ఉండటం మోదీకి ఇష్టం లేదని విమర్శించారు. రాష్ట్రంలో జగన్ మోహన్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు సీఎం సీటు కోసం కొట్లాడుతున్నారు తప్ప ప్రజా సంక్షేమం కోసం కాదని అన్నారు. బహిరంగ సభలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు, భాస్కరయ్య, జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, కార్యదర్శి వర్గ సభ్యుడు శివకుమార్, సత్యం, అన్వేష్, శివనాగమణి, రమాదేవి, స్థానిక నాయకులు షరీఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గండి సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజులివి

- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : 2019–24 మధ్య కాలాన్ని సువర్ణాక్షరాలతో లిఖించాల్సి ఉందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత పాలకవర్గాలు ఏడాదికి రూ.30 లక్షలు కూడా అభివృద్ధి పనులకు కేటాయించలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ ఆశీస్సులతో తమ ప్రభుత్వంలో ఇప్పటికే రూ.114 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. సంక్షేమ పథకాలకు రూ.1314 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయగా, మరో రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మార్కెట్, ఆర్టీసీ బస్టాండ్, పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణాలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయన్నారు. త్వరలో పైపులైన్, డ్రైనేజీ కాలువల నిర్మాణాలను చేపడుతామన్నారు. మున్సిపాలిటీల్లో సిమెంటు రోడ్లు లేని వీధులు లేవని, అన్ని చోట్లా మురుగు కాలువలు ఉన్నాయని ప్రజారోగ్యశాఖ ఎస్ఈ శ్రీనాథరెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేశారన్నారు. 24వేల ఇళ్లు ఒకే సారి మంజూరు చేయడం అభివృద్ధికి నిదర్శనమని అన్నారు. శివాలయం సర్కిల్‌లోని 11 సెంట్ల స్థలంలో క్లాక్ టవర్‌ను నిర్మించేందుకు రూ.7.95 కోట్ల మంజూరుకు కౌన్సిల్ తీర్మానాన్ని ఆమోదించారు. వెల్లాల ఆలయ నిర్మాణానికి త్వరలో టెండర్లు జరుగుతాయని, రామేశ్వరంలోని మూలస్వామి ఆలయ నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. తాను పలు మార్లు చెప్పినా కాలువ ఆక్రమణలపై స్పందించ లేదని కౌన్సిలర్ చింతకుంట సరితారెడ్డి తెలపగా, తాను స్వయంగా ఈ సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. పట్టణంలో కుక్కల బెడద నివారణ కోసం కంపోస్టు యార్డులో డాగ్ కెన్నల్ నిర్మాణానికి రూ.10లక్షలతో కౌన్సిల్ తీర్మానాన్ని ఆమోదించింది. అజెండాలోని మొత్తం 40 అంశాలను ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించారు. సమావేశంలో జెడ్పీవైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ ఖాజా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

చాపాడు : మండలంలోని వెదురూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కనపర్తి రామిరెడ్డి(85) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి మంగళవారం వెదురూరు గ్రామానికి వెళ్లి రామిరెడ్డి మృతుడి కుటుంబీకులను పరామర్శించారు.

బంద్‌ను జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు కల్చరల్ : నవంబర్ 8న చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేష్ కోరారు. ఈ మేరకు స్థానిక డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో బంద్‌కు సంబంధించిన కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, నాగయ్య, బాజ్జి, బాషా, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీ పారదర్శకంగా చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ సిద్దికి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 3220 పోస్టులకు యూనివర్సిటీ ఉద్యోగాలను భర్తీ చేస్తామని నోటిఫికేషన్ ఇచ్చి యూనివర్సిటీలకే ఆ భర్తీ ప్రక్రియను అప్పగించారన్నారు. ఈ పోస్టుల భర్తీ పారదర్శకంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, డి.ఎం.ఓబులేసు, నిరుద్యోగ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్‌లో అవకాశాలు మెండు

వైవీయూ : ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు స్టాక్ మార్కెట్ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఒమన్ దేశ మస్కట్ కళాశాల మాజీ ఆచార్యులు, ప్రస్తుత సెబీ శిక్షణ నిపుణులు డా. కె. ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం వైవీయూ ఎంబీఏశాఖ ఆధ్వర్యంలో 'యువ నిర్వాహకుల ఆర్థిక విద్య' అన్నఅంశంపై రెండురోజుల అవగాహన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు, మెలకువలు, ఉపాధి అవకాశాలపై ఉదాహరణలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి డా. అమృతప్రసాద్‌రెడ్డి, డా.వై. సుబ్బారాయుడు, డా. ఎస్.వి. సుబ్బారెడ్డి, డా.వరప్రభాకర్, డా. సరిత, డా.ఎస్.సుబ్బారెడ్డి, డా. గంగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సెబీ నిపుణుడు ప్రభాకర్

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 8న రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం కడప పాతబస్టాండ్ వద్ద ఉన్న సీఐటీయూ ఆఫీస్‌లో బంద్ పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు దస్తగిరి మాట్లాడారు.

నల్లపురెడ్డిపల్లెలో ప్రభుత్వ బాలికల వసతి గృహం

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లెలో నూతనంగా బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పులివెందుల ప్రాంత వసతి గృహాల పర్యవేక్షణ అధికారి రామాంజనేయులు తెలిపారు. నల్లపురెడ్డిపల్లెలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం విద్యార్థినులతో ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాలు, గ్రామాల నుంచి నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్ పాఠశాలకు వస్తుండటంతో వారికి ఇక్కడ వసతి గృహం ఏర్పాటు చేస్తే బాగుంటుందని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బలరామిరెడ్డి ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా సీఎం కార్యాలయం నుంచి ప్రత్యేక అనుమతులు మంజూరయ్యాయన్నారు.

చుక్కల భూముల సమస్యలను పరిష్కరించండి



కలెక్టర్‌కు రైతుల సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : చుక్కల భూముల వల్ల రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, కడప పార్లమెంటరీ కమిటీ సమన్వయ కర్త సురేష్ బాబు, మండల వైఎస్సార్ సీపీ నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. మంగళవారం చుక్కల భూముల సమస్యలపై ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తోపాటు మండల నాయకులు కలసి జిల్లా కలెక్టర్ విజయరామరాజును ఆయన చాంబర్‌లో కలిశారు. ఖాజీపేట మండలంలో సుమారు 2వేల మంది రైతులు, 4 వేల ఎకరాల భూములు ఉన్నాయన్నారు. 22– ఈలో ఉండాల్సిన భూములు 22– ఏ లో ఉన్నాయన్నారు. ఇలా ఉండటం వల్ల రైతులకు ఎలాంటి మ్యూటేషన్లు లేవని అన్నారు. బ్యాంకులో రుణాలు, అమ్మకాలు జరగడంలో తీవ్ర ఇబ్బందులు తప్పడంలేదన్నారు. రైతులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శివరామిరెడ్డి, సర్పంచ్‌లు కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, నాయకులు రామకృష్ణారెడ్డి, చెన్నకృష్ణారెడ్డి తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.